సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 7 । నవంబర్ । 2023



జగనే మళ్లీ సీఎం కావాలి


ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రులు, నేతలు అన్నారు. - IIలో▸



విగ్రహ నిర్మాణానికి విరాళం

ముమ్మిడివరం: పాత ఇంజరం వద్ద నిర్మిస్తున్న ఆంజనేయుని విగ్రహానికి కపిలేశ్వరపురం మండల మత్స్యకార సొసైటీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు రూ.1,60,000 అందించింది.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

జగనన్న ఆరోగ్య సురక్షతో 2,15,985 మందికి వైద్య సేవలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా 441 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ 420 శిబిరాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో 347, అర్బన్‌లో 73 వైద్య శిబిరాలు జరిగాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో 21 శిబిరాలను 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ నిర్వహించిన శిబిరాల ద్వారా 2,15,985 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. అత్యవసర వైద్యానికి గాను 6,717 మందిని ఆరోగ్యశ్రీ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. వైద్య శిబిరాల్లో 107 మంది ప్రభుత్వ, 144 మంది స్పెషలిస్టు, 113 మంది ప్రైవేటు వైద్యులు, 21 మంది గైనకాలజిస్టులు, 32 మంది దంత వైద్యులు సేవలందించారన్నారు. అవ్వాతాతలకు, కంటిలో శుక్లం ఉన్న రోగులకు కలిపి 25,518 మందికి కళ్లజోళ్లు అవసరమని ప్రతిపాదించామన్నారు. 214 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయగా, మరో 79 మందికి చేయాల్సి ఉందని చెప్పారు. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

స్పందనకు 173 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 173 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొత్తం అర్జీల్లో ఆన్‌లైన్ ద్వారా 154, ప్రజల నుంచి నేరుగా 19 అర్జీలు స్వీకరించామని చెప్పారు. వీటిలో రెవెన్యూ, ఇతర శాఖలకు చెందినవి 65, పోలీసు శాఖవి 21, పంచాయతీరాజ్ 28, గ్రామ/వార్డు సచివాలయాలు 7, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 5, వివిధ శాఖలకు సంబంధించి 47 ఉన్నాయని వివరించారు. ఈ అర్జీలను నాణ్యతతో, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి, అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా, 1902 నంబర్‌కు ప్రజలు తమ సమస్యలు తెలియజేస్తున్నారని, వీటిని ఎప్పటికప్పుడు లాగిన్ ఓపెన్ చేసి పరిష్కరించాలని చెప్పారు.

పోలీసు స్పందనకు 40 ఫిర్యాదులు



స్పందనలో అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ సోమవారం స్పందన నిర్వహించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలతో బాధితుల సమక్షంలోనే మాట్లాడుతూ, అర్జీదారుల ఫిర్యాదులను పరిశీలించారు. వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్పందనకు 40 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఏఎస్పీ జి.వెంకటేశ్వరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని కరిచర్లగూడెం (గోపాలపురం), బొమ్మూరు-3 (రాజమహేంద్రవరం రూరల్), జి.యర్రంపాలెం (రాజానగరం) గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడచిపోయిన తరువాత కూడా కటిక చీకట్లలో మగ్గిపోతున్న తమ జీవితాలపై.. సంక్షేమ సంతకం లిఖించి, సరికొత్త వెలుగులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి.. అణగారిన వర్గాలు మరోసారి జేజేలు పలికాయి. సామాజిక సాధికారతతో తమ బతుకుల్లో కొత్త వెలుగులు తీసుకువచ్చిన జగన్ వెంటే తాము నడుస్తామని దిక్కులు పిక్కటిల్లేలా నినదించాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ.. తొలిసారిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జరిగిన వేళ.. ఆయా వర్గాల ప్రజలు వేలాదిగా కదం తొక్కారు. 'జై జగన్' అంటూ ముక్తకంఠంతో నినదించారు. తమ ఆత్మగౌరవాన్ని పతాక స్థాయిలో నిలబెట్టిన ఆయననే మరోసారి సీఎంను చేసుకుంటామంటూ ప్రతిన బూనారు.



సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

సామాజిక ప్రభంజనం

- జనసాగరమైన సర్పవరం జంక్షన్
- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- మళ్లీ జగనే సీఎం అంటూ హోరెత్తిన నినాదాలు
- ఆలోచింపజేసిన మంత్రుల ప్రసంగాలు



సభలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు. వేదికపై మంత్రులు వనిత, వేణు, ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: **సాగరతీర నగరం కాకినాడ సర్పవరం జంక్షన్ జనసంద్రాన్ని తలపించింది.** వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ జరిగిన వేళ.. సర్పవరం జంక్షన్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. నాలుగున్నరేళ్లుగా తమ అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపనకు కృతజ్ఞత చాటుకునే లక్ష్యంతో అధిక సంఖ్యలో జనం తరలి రావడంతో.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే తొలిసారిగా సోమవారం కాకినాడ రూరల్‌లో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ ఆత్మగౌరవం ఇనుమడించిందని పేర్కొంటూ.. ఈ సభకు అశేష జనవాహిని తరలివచ్చింది.

ఇసుక వేస్తే రాలనట్టు..

వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యాన ఈ బస్సు యాత్రకు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు.. వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని.. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఉత్సాహంగా తరలి వచ్చారు. ఆయా వర్గాలు కేరింతలు కొడుతూ పెద్ద ఎత్తున తరలిరావడంతో నియోజకవర్గ ముఖద్వారం సర్పవరం జంక్షన్ కిక్కిరిసిపోయింది. ఇటు కాకినాడ, అటు పిఠాపురం.. మరోవైపు సర్పవరం గ్రామం, ఇంకోవైపు కాకినాడ పోర్టు రహదారుల్లో ఇసుక వేస్తే రాలనంతగా జనం కనిపించారు. సభ గంట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ జనం తమ నేతల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. సభ ముగిసేంత వరకూ అక్కడే ఉండి, ప్రజాప్రతినిధుల ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు. ప్రధానంగా మహిళలు సభలో 'జై జగన్' నినాదాలతో హోరెత్తించారు. 'గిరాగిరా తిరుగుతుంది ఫ్యాన్' అంటూ చేతులు ఊపుతూ సంతోషంతో నృత్యాలు చేయడం కనిపించింది.

ఆకట్టుకున్న ప్రసంగాలు

సభకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి కోసం నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గణాంకాలతో సహా వివరించారు. చంద్రబాబు పాలన, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మంత్రులు సోదాహరణంగా వివరించిన సందర్భంలో జనం నుంచి అనూహ్య స్పందన లభించింది. సామాజిక సాధికారత కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించినప్పుడు ప్రజలు హర్షాధ్వానాలతో మద్దతు పలికారు. కంటి చూపు మందగించిన విషయం చంద్రబాబుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే తెలిసిందని, ఆయన చూపు తన వర్గం వైపే ఉందనే విషయం రాష్ట్ర ప్రజలకు నాలుగున్నరేళ్ల క్రితమే తెలిసొచ్చిందని మంత్రులు ప్రస్తావించినప్పుడు సభ ఒక్కసారిగా ఈలలు, కేకలతో హోరెత్తిపోయింది. నెల్లూరులో బీసీనైన తనకు తొలిసారి ఎమ్మెల్యే, మంత్రి పదవితో జగన్ గౌరవం పెంచితే.. ఈ ప్రాంతంలో ప్రతిపక్షానికి చెందిన ఒక సీనియర్ నాయకుడు తనను కులం పేరుతో అగౌరపరిచారనే విషయాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. శ్రీకృష్ణుడు కూడా గొర్రెల కాపరి అనే విషయాన్ని ప్రస్తావించి, ప్రతిపక్ష నేతలకు ఆయన సుతిమెత్తగా చురకలు అంటించినప్పుడు జనం కేరింతలు కొట్టారు.



భారీ బైక్ ర్యాలీతో యువత కేరింత

వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు తొలుత కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సర్పవరం జంక్షన్ వరకూ భారీ బైక్ ర్యాలీతో మంత్రులు, ప్రజాప్రతినిధులు సామాజిక సాధికార బస్సు యాత్రగా తరలి వచ్చారు. దీనికి ముందు వందలాది బైక్‌లతో యువకులు కేరింతలు కొడుతూ, ఈలలు వేస్తూ 'జై జగన్' అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. దీనికి దారి పొడవునా స్థానికులు పూలవర్షం కురిపించారు. జగనన్న పాటలతో ఆర్కెస్ట్రా ఆర్టిస్టులు హుషారెత్తించారు. సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ వందన సమర్పణతో సభ ముగిసింది. వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, పండుల రవీంద్ర, బొమ్మి ఇజ్రాయిల్, కర్రి పద్మశ్రీ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎస్.భవానీప్రియ, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్ల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసికుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత పాల్గొన్నారు.



◆ యువకుడిని, ఉడుకు రక్తం కావడంతో నా మాటలు ముక్కుసూటిగా ఉంటాయి. ఎంతో మంది ఫిర్యాదులు చేసినా బీసీ వర్గానికి చెందిన నన్ను ఒక్క మాట కూడా అనకుండా జగన్‌మోహన్‌రెడ్డి 14 ఏళ్లు కంటికి రెప్పలా కాపాడారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ ఆయనతోనే ఉంటాను. గోదావరి జిల్లాల ప్రజలను తెలివైన వారుగా, రాజకీయ చైతన్యం కలిగిన వారుగా చెబుతారు. మీరు వేసే ఓటు ఆ నాయకుడికి చెందాలా.. లేకుంటే ప్యాకేజీ కోసం వచ్చే పక్క నాయకుడికి చెందాలో ఆలోచించాలి. చంద్రబాబు తనయుడు లోకేష్ ఎక్కడ తనను అరెస్టు చేస్తారోననే భయంతో పాదయాత్రను మధ్యలోనే వదిలేసి ఢిల్లీలో ఫైవ్ స్టార్ హోటల్‌లో దాక్కున్నాడు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మళ్లీ వెనక్కు పోదామా లేక ముందుకు పోదామా అనే ఆలోచన చేయాలి. రాబోయే ఎన్నికల్లో మోసపూరిత మాటలు నమ్మవద్దు. ఫ్యాన్ గుర్తుకు బటన్ నొక్కి అఖండ మెజార్టీ ఇవ్వాలి.
– అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే


◆ నాలుగున్నరేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇక ముందు కూడా కొనసాగాలంటే ఆయా వర్గాలన్నీ కలిసికట్టుగా జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాలి.
– బూడి ముత్యాల నాయుడు, ఉప ముఖ్యమంత్రి



◆ దళిత మహిళగా, మంత్రిగా నేను మాట్లాడటానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన సామాజిక సాధికారతే కారణం. అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఎనలేని కృషి చేసి, చరిత్ర సృష్టించిన జగన్‌కు అండగా ఉండి, మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
– తానేటి వనిత, హోం మంత్రి



◆ చంద్రబాబు హయాంలో 30 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. జగన్ 64 లక్షల మందికి ఇస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024లో జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలి. ఆ బాధ్యతను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తీసుకోవాలి.
– పినిపే విశ్వరూప్, రవాణా శాఖ మంత్రి



◆ జీవితమే మోసంగా చంద్రబాబు పాలన సాగిస్తే.. ఎస్సీ, బీసీల అభ్యున్నతే అజెండాగా సీఎం జగన్ పాలన సాగుతోంది.
– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి



◆ ముఖ్యమంత్రి జగన్ ఏ కార్యక్రమాలు అమలు చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారనే ఆలోచనతోనే నిరంతరం నడుస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్లు లూటీ చేయడమే తప్ప పేదల సంక్షేమం కోసం చంద్రబాబు ఏమీ చేయలేదు.
– మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు



◆ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేపట్టని రీతిలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారు. సామాజిక సాధికారతకు అర్థం చెప్పేలా పాలన అందించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలూ సుభిక్షంగా ఉన్నారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు. రూరల్ నియోజకవర్గంలో వివిధ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.800 కోట్లు నేరుగా జమ చేశారు. ఈ లబ్ధిదారుల్లో 90 శాతం వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారు.
– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్

భరోసాకు వేళాయె..

- నేడు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ రెండో విడత నగదు జమ
- సాగుకు చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 1,41,096 మందికి రూ.58.55 కోట్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: అన్నదాతకు నేనున్నానంటూ ప్రభుత్వం 'భరోసా' కల్పిస్తోంది. వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. సాగు పెట్టుబడులకు ఎటువంటి ఇబ్బందులూ ఎదురవకుండా చిన్న, సన్నకారు రైతులకు, కౌలు రైతులకు చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడతగా రైతుభరోసా సొమ్మును శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేయనున్నారు. ఆయన బటన్ నొక్కగానే అర్హులైన రైతుల ఖాతాల్లో 'భరోసా' సొమ్ములు నేరుగా జమ కానున్నాయి. రైతుభరోసా ప్రకటించినప్పటి నుంచీ అర్హులైన ప్రతి రైతుకూ ఈ సొమ్ము అందిస్తూ సాగును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండగలా మార్చింది. ఈ వ్యవసాయ సీజన్‌లో తొలి విడతగా ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.5,550, పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున జిల్లాలోని 1,35,867 మంది రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం రూ.102 కోట్లు పంపిణీ చేసింది. రెండో విడతగా 10,457 మంది కౌలు రైతులు, 1,30,639 మంది రైతులు కలిపి మొత్తం 1,41,096 మందికి రైతుభరోసా కింద రూ.2 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేల చొప్పున రూ.58.55 కోట్లు జమ చేయనున్నారు.

ఇప్పటి వరకూ రూ.650.60 కోట్ల జమ



వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటి వరకూ 1,41,096 మంది రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.650.60 కోట్లు జమ చేసింది. ఈ సంవత్సరం రైతుభరోసా – పీఎం కిసాన్ రెండో విడత నగదు పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం నిర్వహిస్తున్నాం. 1,41,096 మంది రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి నేరుగా రూ.58.55 కోట్లు జమ చేయనున్నారు.
– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్, తూర్పు గోదావరి



గత జూన్‌లో మొదటి విడత రైతు భరోసా చెక్కును రైతులకు అందజేస్తున్న మంత్రులు వేణు, వనిత, ఎమ్మెల్యేలు, కలెక్టర్ మాధవీలత తదితరులు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	మొత్తం రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
అనపర్తి	21,510	8.82
రాజమహేంద్రవరం రూరల్	7,514	3.36
రాజమహేంద్రవరం అర్బన్	0	0
రాజానగరం	31,989	13.32
జగ్గంపేట (గోకవరం)	11,966	4.91
గోపాలపురం	27,752	11.26
కొవ్వూరు	17,817	7.31
నిడదవోలు	22,548	9.53

నాలుగేళ్లుగా లబ్ధి చేకూర్చారిలా..

సంవత్సరం	మొత్తం రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	1,29,182	96.80
2020–21	1,33,502	180.23
2021–22	1,30,965	176.74
2022–23	1,32,680	130.87

ఎంతో ఊరట



పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచీ కౌలు రైతుగా నాకు రైతుభరోసా వర్తిస్తోంది. ఈ ఏడాది కూడా జాబితాలో నా పేరుంది. సాగు పెట్టుబడికి అవసరమైన సొమ్మును ప్రభుత్వం సమకూర్చుతోంది. ఇంతకన్నా ఏం కావాలి! రైతుకు పెట్టుబడే ప్రధాన సమస్య. ఈ సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీర్చుతోంది. కౌలు రైతులకు, రైతులకు బాసటగా నిలుస్తోంది.
– రౌతు వెంకట రమణ, కౌలు రైతు, తొర్రేడు, రాజమహేంద్రవరం రూరల్

అర్హులందరికీ రైతు భరోసా



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోంది. సాగులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాయం అందిస్తోంది. దశల వారీగా అర్జీలను పరిశీలించి, ప్రత్యేక గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రైతుభరోసా వర్తింపజేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం.
– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే నెల తొమ్మిదో తేదీన జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. దీనికోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఆయా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను గుర్తించాలని చెప్పారు. ఆ కేసుల జాబితాను జిల్లా న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. రాజీ పడటానికి యోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సునీత ఈ సందర్భంగా వివరించారు.

క్లుప్తంగా

కార్లను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టిన వ్యక్తి అరెస్ట్


అమలాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

అమలాపురం టౌన్: కార్లను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టి సొమ్ము చేసుకున్న వ్యక్తిని అమలాపురం పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి అయిదు కార్లను స్వాధీనం చేసుకున్నారు. సఖినేటిపల్లి మండలం ఉయ్యూరు మెరక, అంతర్వేది పాలేనికి చెందిన బీర కృష్ణంరాజును ఈ కేసులో ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. అమలాపురం పట్టణం సూర్య నగర్‌కు చెందిన బాధితుడు ఎంఏ హైదర్ తన బాలెనో కారుకు అద్దె నిమిత్తం ఓఎల్ఎక్స్ యాప్‌లో ప్రకటన ఇచ్చారు. దీనిని అవకాశంగా చేసుకుని నిందితుడు కృష్ణంరాజు తాను ఓ పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారినని చెప్పి హైదర్‌ను నమ్మించాడు. గత మార్చి 3వ తేదీన ఈ కారును కృష్ణంరాజు అద్దెకు తీసుకున్నాడు. ఓ నెల అద్దె సొమ్మును నమ్మకంగా చెల్లించాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. బాధితుడు హైదర్ అతని కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గత నెల 29వ తేదీన బాధితుడు అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో కృష్ణంరాజుపై ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ పర్యవేక్షణలో పట్టణ ఎస్సై బి.ప్రభాకరరావు బృందం కేసును లోతుగా దర్యాప్తు చేసింది. నిందితుడు కృష్ణంరాజు అమలాపురంలోనే కాకుండా పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం, నరసాపురం, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో కొంతమందిని నమ్మించి మరో నాలుగు కార్లను అద్దెకు తీసుకున్నట్లు నటించి వాటిని ఆనక తాకట్టు పెట్టుకున్నట్లు గుర్తించామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. ఆయా ప్రాంతాల పోలీసు స్టేషన్లలో ఇతనిపై కేసులు కూడా నమోదయ్యాయని చెప్పారు.

జగనే మళ్లీ సీఎం కావాలి

- అదే సామాజిక బస్సు యాత్ర లక్ష్యం
- స్పష్టం చేసిన మంత్రులు, నేతలు


సామాజిక సాధికార బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రులు విశ్వరూప్, వేణు, ఎంపీలు మోపిదేవి, గీత, ఎమ్మెల్యే దొరబాబు తదితరులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సామాజిక విప్లవానికి నాంది పలికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పలువురు మంత్రులు, సీనియర్ నేతలు అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా కాకినాడ వచ్చిన వారు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నదే సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పింఛన్ విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయనున్నట్టు అక్కడి సీఎం కేసీఆర్ ప్రకటించడం ద్వారా ఇక్కడి పథకాలు ఎంత ఆదర్శంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తూ, సామాజిక సమతూకానికి పెద్ద పీట వేస్తూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కేబినెట్ కూర్పు నుంచి రాజ్యసభ వంటి పెద్దల సభలో సైతం బీసీ నేతలకు అగ్రపీఠం వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తే సీఎం జగన్ మాత్రం బీసీ, ఎస్సీల ఆత్మగౌరవాన్ని కాపాడేలా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సంతృప్తికర విధానంలో పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు.

చేసిన అభివృద్ధి వివరిస్తాం : మంత్రి విశ్వరూప్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక గడచిన నాలుగున్నరేళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు అందించిన సంక్షేమ ఫలాలను, చేసిన అభివృద్ధిని, తెలుగుదేశం పాలనలో ప్రజలను దగా చేసిన వైనాన్ని సామాజిక సాధికార బస్సు యాత్రలో వివరిస్తామని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. చంద్రబాబు తన హయాంలో మైనారిటీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకుండానే కేబినెట్‌ను నడిపారన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ఐదుగురిని ఉప ముఖ్యమంత్రులుగా చేశారన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్ష కోట్లు అందించారన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా సీఎం జగన్ విద్యారంగంలో నాడు – నేడుతో పాటు అనేక పాలనా సంస్కరణల ద్వారా విప్లవాత్మక నిర్ణయాలకు నాంది పలికారన్నారు.

బస్సు యాత్ర చరిత్రాత్మకం : మంత్రి వేణు

సామాజిక సాధికార బస్సు యాత్ర చారిత్రాత్మకమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ వంటి పార్టీలు కులాలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుంటున్నాయని విమర్శించారు. సీఎం జగన్ మాత్రం బీసీ వర్గాలకు పెద్దపీట వేసి సామాజిక విప్లవానికి నాంది పలికారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుంటే పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల కష్టాలను స్వయంగా చూసిన జగన్ అధికారంలోకి వచ్చాక అందరికీ న్యాయం చేశారని, ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలోకి వస్తేనే మంచి రోజులు వస్తాయని చెప్పారు. బీసీ వర్గాలను చంద్రబాబు చులకనగా చూస్తే సీఎం జగన్ వెనుకబడిన వర్గాలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని నిలబడేలా చేశారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబుకు కులం అంటే ఆయన కులం మాత్రమేనని, సీఎం జగన్‌కు కులం అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలని అన్నారు. బీసీలు కూడా ఉన్నత పదవులతో తన పక్కన కూర్చోవాలని జగన్ ఆకాంక్షించారన్నారు. నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

సీఎం నిర్ణయాలు ఓ సంచలనం : ఎంపీ మోపిదేవి

సీఎం జగన్ రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకున్నా ఓ సంచలనమేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేస్తూ సామాజిక విప్లవానికి జగన్ నాంది పలికారన్నారు. శాచ్యురేషన్ విధానంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. అణగారిన, బలహీన వర్గాలు గౌరవంగా జీవించేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 2024లో వైఎస్ జగన్ సీఎం కావలసిన అవసరం ఎందుకుందో సామాజిక సాధికార బస్సు యాత్ర సభ ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

జగన్ పాలనలో అగ్రపీఠం : కన్నబాబు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలకు అగ్రపీఠం వేశారని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అన్ని వెనుకబడిన సామాజిక వర్గాలకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. గత పాలకులు బీసీలను నిర్లక్ష్యం చేస్తే, వారికి సముచిత గౌరవాన్ని అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ డి. దొరబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదీక్ష

- నియమ నిష్ఠలతో 27 రోజుల పాటు నిర్వహణ
- మహిళలు, ఇతరుల కోసం 18, తొమ్మిది రోజులు కూడా..
- 18 రోజుల కోసం 16వ తేదీన, తొమ్మిది రోజులకు 25న దీక్ష స్వీకరణ
- డిసెంబర్ 4న విరమణ

అన్నవరం : సత్యదీక్షలు మంగళవారం ప్రారంభమవుతున్న సందర్భంగా రత్నగిరిపై ప్రత్యేక సందడి నెలకొంది. ఏటా కార్తికమాసం ముందు వచ్చే స్వామివారి జన్మనక్షత్రం 'మఖ' నాడు దీక్ష ప్రారంభమై 27 రోజుల తరువాత వచ్చే మఖ నక్షత్రం రోజున దీక్ష విరమించడం ఆనవాయితీగా వస్తోంది. దానిని అనుసరించి మంగళవారం సత్య దీక్ష లు ప్రారంభమవుతున్నాయి. డిసెంబర్ 4న దీక్ష ముగియనుంది. ఎక్కువ మంది భక్తులు సత్య దీక్ష స్వీకరిస్తారనే ఉద్దేశంతో అన్నవరం చుట్టుపక్కల గ్రామాలలో విస్తృత ప్రచారం చేశారు. 27 రోజుల దీక్ష కుదరని వారికి, మహిళల కోసం 18 రోజులు, తొమ్మిది రోజుల దీక్ష కూడా చేసే అవకాశం కల్పించారు. 18 రోజుల దీక్ష ఈ నెల 16వ తేదీన, తొమ్మిది రోజుల దీక్ష ఈ నెల 25న చేపట్టాలి. వీరు కూడా దీక్ష డిసెంబర్ నాలుగో తేదీన దీక్ష విరమించాల్సి ఉంటుంది.

ఇవీ నియమాలు

పసుపు వస్త్రాలు ధరించి సత్యదేవుని ఆలయం లేదా మరే ఇతర ఆలయంలో అయినా అర్చకుడు లేదా గురుస్వామి లేదా తల్లి చేతుల మీదుగా తులసి మాల ధరించి సత్యదీక్ష చేపట్టవచ్చు. ఈ దీక్ష నియమాలన్నీ స్వామి అయ్యప్ప నియమాల మాదిరిగా ఉంటాయి. ప్రాతఃకాలానికి ముందు నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని సత్యదేవుని పూజ చేయడం, సూర్యాస్తమయం తరువాత స్వామివారికి పూజ చేయడం ఈ దీక్షలో ప్రధానాంశాలు. దీక్షా స్వాములు ఒక పూట భోజనం, రాత్రి వేళ ఫలహారం, నేల మీద నిద్ర, బ్రహ్మచర్యం పాటించడం, మాంసాహారం, ఉల్లిపాయ వంటివి ముట్టకుండా ఉండడం, ఎవరినీ పరుషంగా మాట్లాడకుండా ఉండడం, దీక్షా స్వాములందరినీ సత్యదేవుని స్వరూపంగా భావించి గౌరవించడం ఈ దీక్షలో నియమాలు.

ఈ ఏడాది భారీ సంఖ్యలో దీక్ష స్వీకరించనున్న సిబ్బంది

సత్యదీక్షలను ఏటా చాలా తక్కువ మంది సిబ్బంది స్వీకరించేవారు. అయితే ఈసారి దేవస్థానంలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నాయీ బ్రాహ్మణులు, పురోహితులు సత్యదీక్ష చేపట్టాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. రెగ్యులర్ సిబ్బంది మినహా మిగిలిన వారందరికీ ఉచితంగా దీక్షా వస్త్రాలు అందచేయనున్నట్టు ఈఓ తెలిపారు. దీక్ష చేపట్టిన వారు ఇంటి వద్ద పీఠం ఏర్పాటు చేసుకునే వీలు లేకపోతే వారు బృందాలుగా ఏర్పడి దీక్ష పీఠం ఏర్పాటు చేసుకునేందుకు సత్యనికేతన్ సత్రంలో గదులు కూడా కేటాయించనున్నట్లు తెలిపారు. దీంతో సిబ్బంది దీక్ష చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అనారోగ్య కారణాలు, దీక్ష చేపట్టేందుకు వీలు లేని వారు మినహా మిగిలిన వారంతా దీక్ష చేపట్టనున్నారు. కనీసం 18 రోజులు లేదా తొమ్మిది రోజులు దీక్ష చేపట్టడానికి సిబ్బంది సమాయత్తం అయ్యారు.

గ్రామాలలో పేద భక్తులకు ఉచితంగా దీక్షా వస్త్రాలు, మాలల పంపిణీ

సత్యదీక్షలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు గాను కాకినాడ జిల్లాలోని పలు గ్రామాలలో సత్యదీక్ష వస్త్రాలు, మాలలను దేవస్థానం పంపిణీ చేసింది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 240 మందికి దేవస్థానం అందజేసిన దీక్షా వస్త్రాలు పంపిణీ చేసినట్లు స్వచ్ఛంద ప్రచారకర్త కృష్ణబాబు తెలిపారు. ఇంకా పలువురు కార్యకర్తలు కూడా దీక్షా వస్త్రాలు పంపిణీ చేశారు. గత నెల 31వ తేదీన మారేడుమిల్లి, అడ్డతీగల, తదితర గిరిజన ప్రాంతాల్లో 800 మంది గిరిజన భక్తులకు దీక్షా వస్త్రాలు, మాలలను అడ్డతీగల మండలం పవనగిరి స్వామీజీ, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు కారుకోడి పోచమ్మ (పూజ), అసిస్టెంట్ పీఆర్వో పి.లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు.



సత్యదీక్ష పూజ విధానంపై రూపొందించిన ఆడియో క్యాసెట్


భక్తులకు దీక్షా వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రచార కర్త కృష్ణబాబు

ఆడియో రూపకల్పన



ఈఓ ఆదేశాల మేరకు సత్య దీక్ష పూజ ఆడియో రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాం. ఆ ఆడియో వింటూ కేవలం 18 నిమిషాలలో పూజ చేసుకోవచ్చు. యూట్యూబ్‌లో సత్యదీక్ష పూజా విధానం అని టైపు చేస్తే ఈ ఆడియో వస్తుంది.

– ఛామర్తి కన్నబాబు, వ్రత బ్రహ్మ, వైదిక కమిటీ సభ్యుడు

విస్తృతంగా ప్రచారం



ఈ ఏడాది సత్యదీక్షలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సుమారు పదివేల మంది భక్తులు ఈ దీక్షలు చేపట్టేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. దేవస్థానం సిబ్బంది అందరూ దీక్ష చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. సత్యదీక్ష స్వాముల కోసం దీక్ష విరమణ రోజున గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నాం. స్వాములకు ఉచిత భోజనం అందిస్తున్నాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ.

ఘనంగా మహా సుదర్శన హోమం


మహా సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు


గరుడ వాహన సేవలో పాల్గొన్న భక్తులు, అధికారులు

- గోవింద నామస్మరణతో మారుమోగిన వాడపల్లి
- కన్నుల పండువగా స్వామివారి బ్రహ్మోత్సవాలు
- మలయప్ప అలంకరణతో గరుడ వాహనసేవ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఐదో రోజు బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. మలయప్ప అలంకరణతో స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. మేళతాళాలతో గ్రామంలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం తీర్థం బిందెతో గౌతమీ గోదావరి జలాలను తీసుకువచ్చి ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. గోత్రనామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. అనంతరం నివేదన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. స్వామి వారికి పట్టువస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు అందజేశారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను వైఖానస యువబ్రహ్మ, ఆగమ భాస్కర శ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు నిర్వహిస్తున్నారు. ఉదయం స్వామి వారికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, తోమాల సేవ, ప్రధాన హోమాలు, మహాసుదర్శన హోమం, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, తీర్థ, ప్రసాద వితరణ, మలయప్ప అలంకరణతో గరుడు వాహనసేవ తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

గరుడ వాహన సేవ విశిష్టత

బ్రహ్మోత్సవ సమయంలో ధ్వజస్తంభంపై నుంచి యావత్ దేవతలకు గరుడుడు ఆహ్వానం పలుకుతాడు. సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడు వాహనంపై ఉన్న స్వామిని దర్శిస్తే బాధల నుంచి ఉప శమనం కలుగుతుంది. గరుడ వాహనంపై ఉన్న స్వామిని దర్శించడం వల్ల సర్ప దోష నివారణ కలుగుతుంది.

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, లక్ష తులసి పూజ, ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, నవ గ్రహ హోమాలు, దిగ్దేవతా బలిహరణ, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర మూల మంత్రపూర్వక వేంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ, నీరాజనం నిర్వహిస్తారు.

ఏడుగురికి కారుణ్య నియామకాలు


ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఏడుగురు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఇందులో ఆరుగురికి జూనియర్ సహాయకులుగా, ఒకరికి వీఆర్వోగా ఉద్యోగం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగం పొందిన అభ్యర్థులు విధుల్లో బాధ్యత, అంకితభావంతో పని చేయాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జీవీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురి అరెస్టు

రూ.1.17 లక్షల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

నిడదవోలు : పట్టణంలో ఆటో కన్సల్టింగ్ షాపులో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిని నిడదవోలు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. శనివారం భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్ జగరుతుండగా పట్టణ ఎస్సై పి. నాగరాజుకు వచ్చిన సమాచారంతో ఆటో కన్సల్టింగ్ షాపుపై దాడి చేశారు. అక్కడ బెట్టింగ్ ఆడుతున్న ఎ. సుబ్రహ్మణ్యం, ఎస్.లోహిత్, ఆర్.కనకరాజును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.17 లక్షల నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీనిలో సంబంధం ఇతర వ్యక్తులను విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో పట్టణ ఎస్సై పి.నాగరాజు, కొవ్వూరు సీసీఎస్ ఎస్సై రవీంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్స్ జె.బాలసత్య కుమార్, కె.కరుణాకర్, పీసీ టి.నారాయణ, సీసీఎస్ కానిస్టేబుల్ అన్సారీ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో 'తూర్పు' జట్టుకు ద్వితీయ స్థానం


బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ 67వ పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు అండర్–17లో ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ సోమవారం తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈ పోటీలు సోమవారం జరిగాయి. జిల్లా క్రీడాకారులను, కోచ్‌ను ఆర్జేడీ జి.నాగమణి, డీవైఈఓ రాజు, ఏజీఎఫ్ఐ కార్యదర్శి ప్రసాద్ అభినందించారు.

8న సైక్లింగ్ క్రీడాకారుల ఎంపిక

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 8న సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ప్రసాద్ సోమవారం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడామైదానంలో ఈ ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గలవారు ఈ ఎంపికలకు హాజరు కావాలని, వివరాలకు 94908 96851 నంబరులో సంప్రదించాలని కోరారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా



నజ్ముల్ షకీబ్



అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్

వేదిక: ముంబై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా



రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.



కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.